## పది పరీక్షలు తొలిరోజు ప్రశాంతం





2 లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 22 | మార్చి | 2025
పేజీలు 8

# సా...గుతున్న 'సీతారామ'..!



**-ఈ కేటాయింపులతో పూర్తయ్యేదెలా...?**
**-పెరుగుతున్న అంచనా వ్యయం**
**-బడ్జెట్‌లో కేటాయింపులు రూ. 699.50 కోట్లు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** గోదావరి జలాలు పంట భూములకు మళ్లుతాయన్న ఆశతో ఎదురు చూస్తున్నా రైతాంగం కండ్లు కాయలు కాస్తున్నాయి. అనేక దశాబ్దాల పాటు గోదావరి జలాల సాధన కోసం మహోత్తర పోరాటాలు జరిగాయి. పాలకులు మారుతున్నా రైతుల ఆకాంక్ష మాత్రం నెరవేరడం లేదు. గోదావరి జలాలను వినియోగంలోకి తేవడం ద్వారా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సాగునీటికి కొరత లేకుండా చేయాలని అనేక పోరాటాలు జరిగాయి. ఎట్టకేలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును విడగొట్టి రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ పేరుతో నిర్మాణం ప్రారంభించారు. దాదాపు నాలుగువేల కోట్లు ఖర్చు చేసిన తర్వాత ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ అవతరించడం ఇందిరా సాగర్ ప్రాజెక్టు ఆంధ్రా భూ భాగంలోకి వెళ్లడంతో మళ్లీ గోదావరి జలాల భవితవ్యం ప్రశ్నార్థకమైంది. ఈ దశలో 2016లో అప్పటి కేసిఆర్ ప్రభుత్వం గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మంజిల్లాకు అందించేందుకు సీతారామ పేరుతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. రూ. 7,600 కోట్ల వ్యయంతో ప్రాజెక్టు నిర్మించాలని 3,600 ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు మరో 3,800 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీటిని అందించాలని నిర్ణయించారు. కానీ ప్రాజెక్టు నిర్మాణానికి సరిపడ నిధులు కేటాయించకపోవడం, నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రాజెక్టు వ్యయం బిఆర్ఎస్ హయాంలోనే తొలుత రూ.13వేల కోట్లకు ఆ తర్వాత రూ. 15వేల కోట్లకు చేరుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి

మిగతా 2లో..

### రైతాంగ వ్యతిరేక
## చర్యలను ఖండించండి





**-మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదు : బాగం**
**-ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రైతాంగ వ్యతిరేక చర్యలను అవలంభిస్తూ న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుత మార్గంలో ఆందోళనలు నిర్వహిస్తున్న ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం, రైతులను అరెస్టు చేయడాన్ని యావత్ దేశం ఖండించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు కోరారు. రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని మోడీ ప్రభుత్వానికి కూడా పతనం తప్పదని ఆయన హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం

మిగతా 2లో..

## పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..!



**-అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి శానిటేషన్ బాధ్యతలు**
**-మెయిన్ రోడ్డుకే పరిమితం అవుతున్న పారిశుద్ధ్యం**
**-కంపు కొడుతున్న డ్రైనేజీలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** వైరా మున్సిపాలిటీ పారిశుద్ధ్యం పడకేస్తుంది. కేవలం పారిశుద్ధ్య పనులు మెయిన్ రోడ్లకే పరిమితం అవుతున్నాయి. తప్ప వార్డుల్లో మాత్రం పారిశుద్ధ్యం పడకేసింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీల నుంచి దుర్వాసన వస్తూ ఉంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు పారిశుద్ధ్య పనులు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పారిశుద్ధ్య పనులు ఖమ్మం రోడ్డు మధిర రోడ్డు వరకే పరిమితం అవుతున్నాయి. వ్యాపార సముదాయాలు ఉన్న ప్రాంతాల్లోనే రోడ్లపైనే పారిశుద్ధ్యానికి పనులు చేస్తున్నారు. తప్ప 20 వార్డుల్లో ఎన్నో డ్రైన్‌లు ఉన్నాయి. ఆ డ్రైన్‌లు శుభ్రపరచకపోవడం వలన నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తున్నాయి. దీంతో చుట్టుప్రక్కల గృహాల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 12వ వార్డులో మిట్టపల్లి శివ రైస్ దుకాణం సమీపంలో ఉన్న డ్రైనేజీ నీరు పోక నిల్వ ఉండటంతో గత కొన్ని రోజులుగా దుర్వాసనతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు

మిగతా 2లో..

# సా...గుతున్న 'సీతారామ'..!

**(మొదటిపేజీ తరువాయి)**

వచ్చిన తర్వాత కూడా సరైన రీతిలో కేటాయింపులు లేకపోవడంతో ప్రాజెక్టు వ్యయం రూ. 19,600 కోట్లకు పెరిగింది. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మూడేళ్లలో ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలియజేశారు. పంపు హౌజ్‌ల నిర్మాణం పూర్తయి నేరుగా కాలువల ద్వారా నాగార్జున సాగర్ ఎడమ కాలువకు అనుసంధానం చేశారు. కానీ ప్రాజెక్టు నిర్మాణం 50 శాతం మాత్రమే పూర్తయిందన్నది వాస్తవం. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌తో పాటు పలు నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. కానీ ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ. 699.50 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ రీతి కేటాయింపులు జరిపితే మరో పదేళ్లు గడిచినా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి నిధుల పెంపుపై ప్రభుత్వంపైన ఒత్తిడి తేవాల్సి ఉంది. కాలువల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు గోదావరి జలాలను భూములకు



అందించేందుకు ప్రజాప్రతినిధులు మరింత చొరవ చూపాల్సిన అవసరం ఉంది. దశాబ్దాల ఉమ్మడి ఖమ్మంజిల్లా రైతాంగం కల నెరవేర్చేవిధంగా నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..!





**(మొదటిపేజీ తరువాయి)**

ఎదుర్కొంటున్నారు. ఎన్నిసార్లు ఎవరికి చెప్పినా ఎలాంటి ఉపయోగం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు కూడా వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన వస్తున్నాయి. అసలు ఉన్న పారిశుద్ధ్య కార్మికులు ఎంతమంది ఎక్కడ పనిచేస్తున్నారు. ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు అనే దానిపై పర్యవేక్షణ లోపం పూర్తిస్థాయిలో ఉందనే చెప్పవచ్చును. బాధ్యత గల ప్రభుత్వ అధికారులు ఉన్నప్పుడు కీలకమైన శానిటేషన్ వారికి ఎందుకు అప్పగించలేదు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు శానిటేషన్ ఇవ్వడం పట్ల వారు పూర్తిస్థాయిలో విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన శాఖలకు సంబంధించి ప్రభుత్వ అధికారులు నిర్వహించాల్సిన వాటిలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తే ఇలానే ఉంటుంది. ఒకపక్క ప్రభుత్వం పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని చెబుతుంది. మున్సిపాల్ ప్రత్యేక అధికారిని అదనపు కలెక్టర్ శ్రీజ మున్సిపాల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినప్పుడు ఎక్కడ ఎలాంటి ఏ ప్రాంతంలో అయిన పారిశుద్ధ్య సమస్య లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించిన సందర్భాలు ఉన్నాయి అంటే మున్సిపాల్ ప్రత్యేక అధికారి సూచనలు శానిటేషన్ అధికారులకు వర్తించవా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాలు ఎక్కడ పాటిస్తున్నారు. ఎందుకు పారిశుద్ధ్యాన్ని పూర్తిస్థాయిలో శుభ్రం చేయించలేకపోతున్నారు. అసలు ఎవరు ఎక్కడ ఎందుకు ఏ విధంగా పనిచేస్తున్నారు. ఉన్న సిబ్బంది ఎంత విధులకు వచ్చే సిబ్బంది ఎంత అనేదానిపై కూడా పలురకాల చర్చలు నడుస్తున్నాయి. ఎందుకు అంటే పెద్ద ఎత్తున సిబ్బందిని నియమించుకున్నప్పుడు 20 వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ఎందుకు శుభ్రం చేయించలేకపోతున్నారు. ఒక్క మెయిన్ రోడ్డు వరకే పారిశుద్ధ్య పనులు చేయాలని ఎక్కడైనా చెప్పారా? ఏ అధికారైన ఆదేశించారా ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని అస్తవ్యస్తంగా ఉన్న వైరా మున్సిపాలిటీ లోని పారిశుద్ధ్యాన్ని పరిష్కరించే దిశలో చర్చలు చేపట్టాలని శానిటేషన్ అధికారుల పనితీరు పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. రంజాన్ సందర్బంగా శుక్రవారం ఇందిరా నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పలువురు ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు. మజీద్ ముజావరు ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టిజీవో ఖమ్మంజిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కోడి లింగయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. బిక్కు, కె. వెంకటరమణ, కోశాధికారి అజ్మత్‌బేగ్, రాష్ట్ర నాయకులు అంజయ్య, జిల్లా నాయకులు



గఫార్, పాషా, ఆర్. వెంకటేశ్వరరావు, జి. నాగేశ్వరరావు, సిద్దిక్, కోటేశ్వరరావు, రెహ్మాన్, చావా నారాయణరావు తదితరులు హాజరయ్యారు.

# తారకరామ ఆటోనగర్‌లో ఇఫ్తార్ విందు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో గల తారకరామ ఆటోనగర్‌లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొని ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యతను చాటేందుకు తారకరామ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రాలు, వినాయక మండపాలు, కరోనా సమయంలో భోజన వసతి వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జున్, ఖమ్మం ఫోర్ వీలర్స్ ఆటో టెక్నిషియన్స్ అధ్యక్షులు ఎస్‌కె పాషా, గంగవరపు శ్రీనివాసరావు, కె. రవి, ప్రసాద్, చారి, సైదులు,



భీమయ్య, శ్యామేందర్‌రెడ్డి, అబ్దుల్ రషీద్, ప్రసన్నకృష్ణ, అక్బర్, సలీమ్, వెంకన్న, మహేష్, ముజీద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలు తొలిరోజు ప్రశాంతం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మంజిల్లా వ్యాప్తంగా 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు రెగ్యులర్ 16,417 మంది విద్యార్థులకు గాను 16,391 మంది విద్యార్థులు హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 21 మందికి గాను 17 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. డిస్ట్రిక్ లెవల్ అబ్జర్వర్ మూడు పరీక్షా కేంద్రాలను, డిస్ట్రిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఏడు పరీక్షా కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 37 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విద్యుత్ సౌకర్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని డిఈవో తెలిపారు. పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్‌ను అమలు చేశారు. సమీపంలోని జిరాక్స్, ఇంటర్నేట్, స్టేషనరీ షాపులను మూసివేశారు.

# రైతాంగ వ్యతిరేక చర్యలను ఖండించండి

**(మొదటిపేజీ తరువాయి)**




చేశారు. అంతకు ముందు బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జగత్‌సింగ్ దల్లేవాల్ శాంతియుతంగా 56 రోజులు నిరాహార దీక్ష చేస్తే ప్రభుత్వం సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి దీక్షను విరమింపజేసిందని గుర్తు చేశారు. శంభూ కలౌరీ ప్రాంతంలో పంజాబ్, హర్యానా ప్రభుత్వాలు హింసాత్మక చర్యలకు పాల్పడి బుల్‌డోజర్లతో దీక్షా శిబిరాలను ధ్వంసం చేశాయని హేమంతరావు తెలిపారు. నల్లచట్టాల రద్దు హామీ నాడే మద్దతు ధరపై కూడా హామీ ఇచ్చారని ఇప్పటికీ ఆరుసార్లు చర్చలు జరిపినా మద్దతు ధరపై ప్రభుత్వం తెల్చలేదన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంభించడంలో అన్ని ప్రభుత్వాలది ఒకటే దారి అని శంభూ కలౌరి ఘటన రుజువు చేసిందన్నారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పరం చేసే క్రమంలోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. ముమ్మందు ఈ ప్రభుత్వానికి రైతాంగ పోరాటాల విలువ ఏమిటో చూపాలని ఆయన పిలుపునిచ్చారు. రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడిన గత ప్రభుత్వాలు ఏమయ్యాయో ఇప్పటి పాలకులు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మిడికంటి వెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, బానోత్ రాంకోటి, ఏలూరి భాస్కర్‌రావు, బానోత్ రవి, పగిడిపల్లి ఏసు, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, మద్దోజు శ్రావణ్, పదిమిల వెంకట నర్సయ్య, పోటు పూర్ణచందర్‌రావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జయమ్మకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణ పరిధిలోని ఎన్.టి.ఆర్ కాలనీకి చెందిన తడికమళ్ళ జయమ్మ ఇల్లు గత రెండు రోజుల క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని వస్తువులు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. శుక్రవారం పట్టణంలో పర్యటించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా



దయానంద్ విజయ్ కుమార్ జయమ్మ ఇంటిని పరిశీలించి బాదితురాలికి ఆర్థిక సహాయం ఆందజేశారు. అదేవిధంగా సత్తుపల్లి తహాశీల్దార్ కి చరవాణి ద్వారా పరిస్థితిని వివరించి ప్రభుత్వ సహాయం అందేలా చూడాలన్నారు. అనంతరం ఎన్.టి.ఆర్ కాలనీ లో అనారోగ్యం తో బాధపడుతున్న ఖమ్మంపాటి సురేష్ ని పరామర్శించి, మెడికల్ రిపోర్ట్ లు పరిశీలించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. దయానంద్ వెంట జాతీయ బీసీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్, మార్కెట్ కమిటి చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మాజీ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి,చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, పింగళి సామ్యూల్ తదితరులున్నారు.

# పలు కుటుంబాలకు సండ్ర పరామర్శ

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణంలో తోట వెంకటరావు వీధికి చెందిన ఎలక్ట్రిషన్ కొండలరావు ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ ఎం.ఎల్.ఏ సండ్ర వెంకటవీరయ్య శుక్రవారం వారి నివాసానికి వెళ్ళి కొండలరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్ళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అదేవి



ధంగా రాజభాపయ్య వీధికి చెందిన రాజారావు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కలుసుకుని పరామర్శించి, రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. సండ్ర వెంట జిల్లా గ్రందాలయ సంస్థ మాజీ చైర్మన్ కొత్తూరు ఉమా మహేశ్వరరావు, దొడ్డా శంకర్ రావు,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, మల్లూరి అంకమరాజు, అమరవరపు కృష్ణారావు, అద్దంకి అనిల్, చాంద్ పాషా, వల్లభనేని పవన్ , రాజ్యలక్ష్మి , కోనేరు నాని, షేక్ ఖాసీం తదితరులున్నారు.

# అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**-బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. 2024 25 వార్షిక రుణ ప్రణాళికలో డిసెంబర్ 2024 వరకు రూ. 3610.49 కోట్ల స్వల్పకాలిక పంట రుణాలుగా అందజేయడం జరిగిందని, వ్యవసాయ టర్మ్ రుణాలుగా వ్యవసాయ రంగానికి రూ.1801.04 కోట్లు బ్యాంకు ద్వారా ఇవ్వడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి లక్ష్యాలను సాధించాలని, రైతుల పంట రుణాలు సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకు రూ. 1569.82 కోట్లు ఇవ్వడం జరిగిందని, విద్యా రుణాలు రూ.24.63 కోట్లు, గృహ రుణాలు రూ. 73.97 కోట్లు అందించడం జరిగిందన్నారు. ప్రాధాన్యత రంగాలకు మొత్తంగా రూ. 7818.81 కోట్లు అందించడం జరిగిందన్నారు. అప్రాధాన్యత రంగాలకు రూ.3644.19 కోట్లు అందించినట్లు మొత్తంగా జిల్లాలో రూ.11463 కోట్లు డిసెంబర్ 2024 మాసం వరకు బ్యాంకుల ద్వారా అందించినట్లు తెలిపారు. ఎస్సి, ఎస్టి లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందజేసి లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించాలన్నారు. జిల్లాలో 891 మహిళా సంఘాలకు 2024 25 సంవత్సరానికి రూ. 17769.95 లక్షల బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పటి వరకు అందించామన్నారు. పిఎంఈజిసి, పిఎంఎఫ్ఎంఈ రుణాలు లబ్ధిదారులకు సకాలంలో అందించాలన్నారు. పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి లబ్ధిదారులకు కిసాన్ క్రెడిట్ రుణాలు సకాలంలో ఇవ్వాలని తెలిపారు. రిజర్వు బ్యాంకు సూచనల మేరకు నూరు శాతం ప్రజలకు డిజిటల్ సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2025 26న ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం శ్రీనివాసరెడ్డి, ఆర్‌బిఐ ఎల్‌డివో పల్లవి, నాబార్డ్ డిడిఎం సుజిత్‌కుమార్, ఎస్‌బిఐ ఆర్‌ఎం జి. లింగస్వామి, యుబిఐ డిజిఎం హన్మంతరెడ్డి, టిజిఎం ఆర్‌ఎన్ విజయ్, ఇంచార్జి ఇడి ఎస్సి కార్పోరేషన్ నవీన్‌బాబు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వాసవిరాణి, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

# ఖమ్మం కార్పోరేషన్‌లో జోనల్ వ్యవస్థ ఏర్పాటు

**-ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్‌లో జోనల్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన పౌర సేవలు అందుతాయని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. శుక్రవారం కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో కలిసి ఖమ్మం నగరంలో నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్ల కార్యాలయాల ఏర్పాటు కోసం అనువైన భవనాలను పరిశీలించారు. గొల్లగూడెం, చర్చికాంపౌండ్, త్రీటౌన్ , పాత మున్సిపల్ కార్యాలయాలు వంటి ప్రభుత్వ భవనాలు ప్రాథమికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిపాలన అవసరాలు తీర్చేందుకు జోనల్ వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఒకే కార్యాలయం ద్వారా 60 డివిజన్ల ప్రజలకు పౌర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మహా నగరాలకు దీటుగా పాలనను వికేంద్రీకరించి పౌర సేవలను మరింత సమీపంగా తీసుకు రావడానికి జోనల్ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. ప్రతి జోనల్ కార్యాలయంలో రెవెన్యూ, ఇంజనీరింగ్, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, పవర్ సర్వీసులు వంటి విభాగాలకు చెందిన 17 మంది అధికారుల బృందం సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. జోనల్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా నగర ప్రజలకు వేగవంతంగా, సమర్థవంతమైన పౌర సేవలు అందుతాయన్నారు.

# షార్ట్‌సర్క్యూట్‌తో సుబాబుల్ తోట దగ్ధం





**ప్రజాపక్షం/ మధిర :** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్‌సర్క్యూట్ కారణంతో సుమారు రెండు ఎకరాల సుబాబుల్ తోటకు నిప్పు అంటుకుని దగ్ధమైన సంఘటన దెందుకూరు గ్రామశివారులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల పరిధిలోని దెందుకూరు గ్రామానికి చెందిన రైతు అయితం ప్రసాద్‌కి చెందిన సర్వే నెంబర్ 44/ఇలోని సుబాబుల్ తోట మరో రైతుకు చెందిన సుబాబుల్ తోటలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సాంకేతిక లోపం వలన ట్రాన్స్‌ఫార్మర్ నుండి నిప్పు రవ్వలు ఎగసిపడి సుబాబుల్‌తోటకు అంటుకోవటంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. సుమారు రెండున్న ఎకరాల మేర మంటలు వ్యాపించడంతో రూ.3లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగానే సుబాబుల్ తోట దగ్ధమైందని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుండి తొలగించాలని, తనకు నష్టపరిహారం అందేలా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

## భగత్‌సింగ్ 94వ వర్ధంతి పోస్టర్లు ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సిపిఐ కార్యాలయంలో(ఏఐవైఎఫ్) అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 9వ వర్ధంతి పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సహాయకార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడారు...ఈనెల 23న వరంగల్‌క్రాస్‌రోడ్‌లో సాయంత్రం 5గంటలకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుకుదేవ్ వర్ధంతిలను పురస్కరించుకొని పెద్ద ఎత్తున కాగడాల ప్రదర్శన ఉంటుందన్నారు. కావున యువజన సంఘం సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఘనపారపు ఉపేందర్, పాలేరునియోజకవర్గ ఉపాధ్యక్షుడు దండి రమేష్, యువజన సంఘం సభ్యులు మామిడాల కిరణ్, పొన్నెకంటి అఖిల్, సిపిఐ నాయకులు వెంపట రాము, మేళ్లచెర్వు రవి తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలు ప్రశాంతం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలో శుక్రవారం ప్రారంభమైన పదిపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏదులాపురంమున్సిపాలిటీలో 5 సెంటర్లు, ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడులో 1సెంటర్‌తో కలిపి 6 సెంటర్లలలో పరీక్షలు నిర్వహించారు. ఏదులాపురం మున్సిపాలిటీలోని జిటిడబ్ల్యూఏజిహెచ్‌ఎస్ గొల్లగూడెంలో 180మంది విద్యార్థులకు గాను 180మంది, ఏదులాపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 190మంది విద్యార్థులకు 190మంది, జలగంనగర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 141మంది విద్యార్థులకు 141మంది కరుణగిరి బిషప్‌చర్చ్‌లోని కారుణ్యవిద్యభవన్‌లో 164మంది విద్యార్థులకు 164మంది హాజరయ్యారు. సత్యనారాయణపురంలోని కేజిబీవిలో 260మంది విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తల్లంపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో 93మంది విద్యార్థులకు 93మంది హాజరయ్యారు. మొత్తం 1032 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఎంఈఓ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## బిఆర్‌ఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ 2025 సంవత్సర క్యాలెండర్, డైరీని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన త ర్వాత పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఎనలే ని కృషి చేసిందన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన గడిచిన సంవత్సరన్నర కాలంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బిఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగురవేయటం ఖాయమని, తెలంగాణ ప్రజలందరూ మళ్లీ బిఆర్‌ఎస్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల, పట్టణ అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వర్లు, మొండితోక జయాకర్, సొసైటీ చైర్మన్ బిక్కి ప్రసాద్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కోటారి రాఘవరావు, కర్నాటి శ్రీను, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## ఆత్కూరులో చలివేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధి ఆత్కూరు గ్రామంలోని సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మండలపంచాయతీ అధికారి టివిఎల్ఎన్ శాస్త్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలం దృష్టిలో ఉంచుకుని మధిర వైరా ప్రధాన రహదారిలో ప్రయాణించే వాహనదారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర :** దేశంలో విద్య కషాయికరణకు, మతోన్మాదం, డ్రక్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన భగత్‌సింగ్‌ను నేటి యువతీ, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్, ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా స్థానిక బోడపూడి భవన్ నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యాసనాలకు బానిసలవుతున్నారని, చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ సేవా కార్యక్రమాలు, క్రీడా రంగాల్లో ముందుండాలన్నారు. విద్యార్థులు, యువకులను చైతన్యపర్చటంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఎల్లవేళలా ముందుంటుందన్నారు. భరత్‌సింగ్ పోరాట పటిమను అలవర్చుకుని యువతీ, యువకులు దేశాభివృద్ధికి, సమాజంలోని చెడును అంతమొందిచటానికి ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రామనర్సయ్య, మురళీ, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతానికి కోతుల తరలింపు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థలో పట్టుకున్న కోతులను అధికారులు అటవీ ప్రాంతానికి తరలించారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో పట్టుకున్న 247 కోతులను శుక్రవారం ఇల్లందు అటవీ చెక్‌పోస్టు ప్రాంతానికి తరలించారు. ఖమ్మం నగర ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్న కోతులను పట్టుకుని వాటిని సహజ వాతావరణానికి అనువైన అటవీ ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కోతుల తరలింపు వల్ల ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు వన్య ప్రాణులనుసహాజనివాసాల్లోసంరక్షించేందుకుఅవకాశంకలుగుతుందనిఅధికారులుతెలిపారు.

## బిఆర్ఎస్ విధానాలనే కాంగ్రెస్ అవలంభిస్తుంది



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తుందని, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పెరుమాళ్లపల్లి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం తనతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అరెస్టులను ఖండించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే, ప్రజలపక్షాన తము పోరాడుతుంటే నిర్బాంధాలు చేయడం ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదన్నారు. ఎన్ని అక్రమ అరెస్టులు చేసిన ప్రజలపక్షాన శాంతియుతంగా నిరసన తెలుపుతామన్నారు. అసంఘుటితరంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమాన్ని అక్రమ అరెస్టులతో ఆపలేరన్నారు.

## శ్రీ చైతన్యలో ఫ్యాకల్టీ ప్రోగ్రాం ప్రారంభం




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లుపంచాయతీపరిధిలో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో క్యాంపస్ టు కనెక్ట్ అనే అంశంపై రెండురోజుల ప్రోగ్రాంను శుక్రవారం ప్రారంభించారు. ఇందులో టాస్క్ ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలకు చెందిన 60మంది అధ్యాపకులు హాజరయ్యారు. వీరికి ఇన్ఫోసిస్ తెలంగాణ స్టేట్‌హెడ్ నివాస్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడారు...ఇటువంటి ప్రోగాంల ద్వారా ఫ్యాకల్టీకి విలువైన సమాచరంతో పాటు మంచి అనుభవం లభిస్తుందన్నారు. దీంతో విద్యార్థులను ప్రపంచంతో పోటి పడేలా తయారు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అకాడిమిక్ డీన్ డాక్టర్ వి. సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, పాలిటెక్నిక్ ఇన్జార్జి సిహెచ్ కృష్ణప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ చిరంజీవి, శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదోతరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండలంలో శుక్రవారం నిర్వహించిన పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని కొణిజర్ల, తనికెళ్ల, తనికెళ్లలోని సెయింట్‌మేరీస్, సింగరాయపాలెం పాఠశాలలో పరీక్షలు జరిగాయి. కొణిజర్లలో 234 విద్యార్థులకు గాను 232 విద్యార్థులు హాజరయ్యారు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. తనికెళ్లలో 170 మందికి గాను పూర్తిగా హాజరయ్యారు. సెయింట్ మేరీస్ పాఠశాలలో 164 మందికి పూర్థిస్థాయిలో హాజరయ్యారు. సింగరాయపాలెం స్కూల్‌లో 158 మందికి 158 మంది హాజరయ్యారు. మొత్తం 726 మందికి గాను 724 మంది హాజరయ్యారు. పరక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

## ఘనంగా పొంగులేటి సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తమిళనాడు, కర్ణాటకల బాజాపా ఇంచార్జ్, మాజీ ఎమ్మె ల్సీ, జాతీయ నాయకుడు డా. పొంగులేటి సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు సత్తుపల్లి పట్టణ, మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం భారతీయ జనతా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పొం గులేటి జన్మదినాన్ని పురస్కరించుకొని ఖమ్మం శ్రీ రక్ష హాస్పిటల్ అధినేత డా. గోంగూర వెంకటేశ్వరరావు సహకారంతో డా. అభిలాష్ రెడ్డి నేతృత్వంలో కిష్టారం గ్రామంలోని అంబేద్కర్ నగర్, బీసీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, కాలనీలలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు హాజరైనారు. ఈ వేడుకలలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామ లింగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ణి వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, రాఘవరావు, పాలకొల్లు శ్రీనివాస్, బానోత్ విజయ్, పర్సా రాంబాబు, గొర్ల ప్రభాకర్ రెడ్డి, నాగస్వామి, ఆపతి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ములేస్తున్నా పట్టించుకోరా..?

**-డివైడర్‌ను తొలగించిన స్థానంలో సిమెంట్‌తో పూడ్చివేత**
**-రోడ్డు మధ్యలో పేరుకుపోయిన ఇసుక**
**-దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**
**-రోడ్డును శుభ్రం చేయాలని వేడుకోలు**









**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దుమ్ములేస్తున్న ఖమ్మం కార్పోరేషన్ అధికారులు పట్టించుకోరా.. అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రోడ్డుపై వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారుల్లో వణుకుపుడుతోంది. ఖమ్మం మయూరి సెంటర్ నుంచి రాపర్తి నగర్ బైపాస్ వరకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన డివైడర్‌ను ఇటీవలకాలంలో సంబంధిత అధికారులు తొలగించారు. తొలగించిన ప్రదేశంలో సిమెంట్‌తో పూడ్చారు. కానీ అక్కడక్కడ గుంతలు సరిగా పూడ్చకపోవడం, అక్కడే ఇసుకను కుప్పలు కుప్పలుగా వదిలేయడంతో ఆ రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఇతర పెద్ద వాహనాలు వెళ్లేటప్పుడు ఆ ఇసుక వల్ల దుమ్ములేసి వెనక వచ్చే ఇతర వాహనదారులకు రహదారి కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కార్పోరేషన్ అధికారులు రహదారి మధ్యలో ఉన్న ఇసుక, మట్టిని శుభ్రం చేయించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

**ముఖ్యమంత్రిని కలిసి అభ్యర్థించిన ఎమ్మెల్యే రాగమయి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మా నియోజకవర్గ అభివృద్ధికి నిధులిచ్చి ఆదుకోవాలని, కిష్టారంలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన సైలో బంకర్ ద్వారా ఇబ్బందులు పడుతున్న కిష్టారం అంబేద్కర్ నగర్, బిసి కాలనీల ప్రజల కష్టాలను తీర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అభ్యర్థించారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన చాంబర్ లో మర్యాదపూర్వకంగా ఎం.ఎల్.ఏ డా.మట్టా రాగమయి కలిసి సత్తుపల్లి మండలం కిష్టారంలో సింగరేణి నిర్మించిన సైలో బంకర్ ద్వారా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, బాధితులకు పునారావసం కల్పించాలని కోరారు. అదే విధంగా సత్తుపల్లి నియోజకవర్గంలో నూతన ప్రభుత్వ ఐటిఐ కాలేజ్ ని మంజూరు చేయాలని, నియోజకవర్గంలోని గ్రామాలు, ప్రజల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం కాళోజీ నారాయణరావు యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కె.ఎన్.ఆర్.యూ.హెచ్.ఎస్) నూతన విసిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.వి నందన్ కుమార్ రెడ్డిను మర్యాద పూర్వకంగా కలిశారు.

# వేసవిలో ఈ జ్యూస్ తాగారంటే..



**ప్రజాపక్షం/మణుగూరు:** మండుటెండలతో జనాలు అల్లడిపోతున్నారు. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే సహజ సిద్ధంగా శరీరాన్ని చల్లగా ఉంచడంలో కీరదోసకు మించిన ఆప్షన్ మరొకటి లేదు. కీర ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. కీరదోస ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉండే పోషకాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. పొటాషియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉండటం వలన, అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఇది మంచి ఎంపిక. వేసవిలో ప్రతిరోజూ కీరదోస జ్యూస్ తాగడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం. కీరదోస జ్యూస్ మంచి డీటాక్స్ డ్రింక్‌గా కూడా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ప్రతి ఉదయం ఈ కూరగాయల జ్యూస్ తాగడం వల్ల శరీరం నుంచి అవాంఛిత వ్యర్థాలను బయటకు పంపి శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇది అనేక వ్యాధుల నుంచి మనల్ని రక్షిస్తుంది. ప్రతిరోజూ కీరదోస జ్యూస్ తాగడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడుతుంది. బరువు కూడా త్వరగా తగ్గుతుంది. బెల్లీ ఫ్యాట్ కూడా కరిగిపోతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఊబకాయం ఉన్న వారికి కీరదోస జ్యూస్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కాబట్టి దీన్ని ప్రతిరోజూ తినడం కూడా చాలా మంచిది. వేసవి రోజుల్లో కీరదోస జ్యూస్ తాగడం వల్ల వేడి అనుభూతిని తగ్గి, శరీరం చల్లబడుతుంది. ఇది వడదెబ్బ నుంచి రక్షిస్తుందని నిపుణులు అంటున్నారు. అలాగే దీనిలోని పొటాషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. ఇది మన శరీరంలోని చక్కెర, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుంది. అంతేకాకుండా ఇది గుండెను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది.కీరదోసలో విటమిన్ కె ఎక్కువగా ఉంటుంది. ఇది గాయాల నుంచి రక్తస్రావం కాకుండా వెంటనే రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతుంది. దీనిలోని మెగ్నీషియం బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. నిద్రలేమి సమస్యను తగ్గిస్తుంది. ఇది శరీరానికి విశ్రాంతిని ఇవ్వడమే కాకుండా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది అజీర్ణం, గ్యాస్, మలబద్ధకాన్ని కూడా తగ్గిస్తుంది.

# 31 నాటికి నవమి ఏర్పాట్లు పూర్తి చేయాలి

**- భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలి**
**- ఆర్‌డిఓ దామోదర్ రావు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఈనెల 31 నాటికి శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవ ఏర్పాట్ల పనులు పూర్తి చేసి అప్పగించాలని ఆర్‌డిఓ దామోదర్ రావు అన్నారు. శుక్రవారం స్థానం ఆర్డిఓ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరామ నవమి డివిజన్ స్థాయి సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 6న శ్రీరామ నవమి, 7న పట్టాభిషేక మహోత్సవం ఉన్నందున అప్పగించిన పనులు వేగంగా పూర్తి చేయాలని, కళ్యాణ మహోత్సవానికి తరలి వచ్చే భక్తులు సకల సౌకర్యాలు కల్పించాలన్నారు. స్టేడియాన్ని 24 సెక్టార్లుగా విభజించారని, ప్రతీ సెక్టారులో భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమైన ఉండాలని, భక్తులు ఒక సెక్టార్ నుండి మరొక సెక్టార్‌కు వెళ్లకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా లాడ్జీలు బుక్ చేసుకునేందుకు సౌకర్యం కల్పించామని, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్ల విక్రయాలు సైతం జరుతాయని చెప్పారు. సెక్టార్లలో పరిశుభ్రత పాటించే విధంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని, విధులు నిర్వహించే వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలన్నారు. పారిశుధ్యానికి పట్టణాన్ని 25 జోన్లుగా విభజించడం జరిగిందని, ఇందుకు సంబంధించి పనులు కేటాయించిన అధికారులు చూసుకోవాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు ఏర్పాటు చేయాలని, మజ్జిక, మంచినీటి ప్యాకెట్లు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దాదాపు 200 మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, సెక్టార్లలో మంచినీటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్ విషయంలో చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రిస్కీ టీమ్‌లను అందుబాటులో ఉంచుకోవాలని, గోదావరి నదిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల రద్దీ నియంత్రణకు మూడు అంచెల భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఇందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవచూపాలన్నారు. గోదావరి నదిపై వాహనాలు ఆగిపోతే వాటిని తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు క్రైన్లను సిద్ధంగా ఉంచాలని, 24 గం.పాటు వైద్య సేవలు, సమాచార కేంద్రాలు ఉండాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితులకు గానూ 20 బెడ్లు, ఐసియూ వార్డును సిద్ధం చేయాలన్నారు. తలంబ్రాలు, ప్రసాదాల కౌంటర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతీ భక్తునికీ పవిత్రమైన స్వామివారి తలంబ్రాలు చేరేలా చూడాలన్నారు. స్వామి కళ్యాణం, పట్టాభిషేకం విజయవంతం అయ్యేందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అదే విధంగా పర్ణశాల జరిగే సీతారాముల కళ్యాణ వేడుక వైభవంగా జరిగేలా చూడాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, తూరుబాక వద్ద వంతెన నిర్మాణ పనులు నడుస్తున్నందున వాహనాలు తిరిగేందుకు తాత్కాలిక రోడ్డు సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి విక్రాంతి కుమార్ సింగ్, దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, తహాశిల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఇఇ రాంప్రసాద్, వివిధ మండలాల తహాశిల్దార్లు, ఎంపిడిఓలు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా సౌకర్యాలు ఉండాలి

**- నర్సింగ్ వసతి గృహం సందర్శనలో కలెక్టర్ అసంతృప్తి**



**ప్రజాపక్షం/భద్రాచలం :** నర్సింగ్ విద్యార్థులు చదువుకునేలా సౌకర్యాలు ఉండాలని 140 మంది విద్యార్థిలు కలిసిక ఒకటే హాల్లో ఉండటం సరైంది కాదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినీలకు అందుతున్న సదుపాయాలని దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 140 మంది విద్యార్థినీలు ఒకే పెద్ద గదిలో ఉండటం సరైంది కాదని, కదులు పార్టేషన్ చేయాలన్నారు. వసతి గృహంలోని హాల్లో ఎండ అధికంగా ఉన్నందున థర్మాకోల్ సీలింగ్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గదుల్ల కూలర్లు లేపటి లోగా అమర్చాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఎంతేకాకుండా విద్యార్థుల తాగునీటి సౌకర్యం కోసం ఫ్రిజ్ కూడా తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థినీలు ఉండే వసతి గృహం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ తక్కువ ఎత్తుగా ఉందని, ఇది మంచిది కాదని, వెంటనే షిట్లు అమర్చి ఎత్తు పెంచాలన్నారు. విద్యార్థినీలు ప్రశాంతమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలని, నాణ్యమైన భోజన, పరిశుభ్రమైన తాగునీరు అందించాలని వార్డెన్‌కు సూచించారు. వసతిగృహ నిర్మాణంపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట వార్డెన్, సిబ్బంది తదితరులున్నారు.

## సీపీఐ 24 ఏరియా శాఖ సమావేశం




**ప్రజాపక్షం/ఇల్లందు:** పట్టణంలోని 22, 23, 24 వార్డుల శాఖ సమావేశం శుక్రవారం 24ఏరియాలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కమిటి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య మాట్లాడుతూ..ప్రజా సమస్యల పోరాటంలో పార్టీ పరంగా ముందుండాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని, పార్టీ బలోపేతం దిశగా సీపీఐ శ్రేణులు కృషి చేయాలన్నారు. అనంతరం 24 ఏరియాలో శాఖ సభ్యులు కలవల రాజారాం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాస శ్రీనివాస్, బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, ఉడత ఐలయ్య, రాజారాం, చెరకు సారయ్య, కుమ్మరి రవిందర్, రామకృష్ణ, వడ్ల శ్రీను, వలీ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టభద్రత కల్పించడం హర్షనీయం



**ప్రజాపక్షం/ఇల్లందు :** ఎస్సీవర్గీకరణ బిల్లుకు చట్టభద్రత కల్పించడం హర్షనీయమని టీఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి, దళితరత్న మేకల శ్యాం పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని కొత్తబస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ముందుగా అంబేద్కర్, కొమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టభద్రత కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ,రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి వర్గానికి, ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఉమ్మడి జిల్లా శాసనసభ సభ్యులు, ఎస్సీ వర్గీకరణకు మొదటి నుంచి ఇప్పటికివరకు సంపూర్ణ సహకారం అందించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా లేఖలు అందించిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాచపల్లి చంద్రశేఖర్, యువసేవ జిల్లా అధ్యక్షులు తాళ్ల శివ, మహిళా కమిటీ పట్టణ అధ్యక్షులు బొజ్జ రాణి, పట్టణ అధ్యక్షులు దుర్గా ప్రసాద్, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పారపు ప్రసాద్, యువసేన పట్టణ కమిటీ అధ్యక్షులు మెంతన ప్రకాశ్, జిల్లా కమిటీ సభ్యులు నేలమరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## లోపించిన పారిశుధ్యం



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ గ్రామ పంచాయతీలో పారిశుధ్యం లోపించింది. ఎదురుగడ్డ నుండి కొత్తగూడెం వెళ్లే మెయిన్ రోడ్డు నందు ప్లాస్టిక్ బాటిళ్ళు, కవర్ల తో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. ఎదురుగడ్డ సెయింట్ విన్సెంట్ పాఠశాల సమీపంలోనే చెత్తను వేయడంతో విద్యార్థులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం కొత్తగూడెం వెళ్లి వచ్చే వాహనాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం చెత్తతో పేరుకుపోయి దుర్వాసన రావడం వలన వాహనదారులు, పాదాచారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. చెత్త భారీగా పేరుకుపోవడంతో చుట్టుప్రక్కల నివసించే ప్రజలకు దోమల బెడదతో అనారోగ్య సమస్యలు సైతం తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయితీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజల కోరుతున్నారు.

## ఆక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జీ.మస్తాన్ పేర్కొన్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమం సందర్భంగా స్థానిక పోలీసులు పీడీఎస్ యూ నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా రంగం కు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు అందించాలని, కార్పోరేట్ సంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ లో వీసీ విడుదల చేసిన సర్కులర్ ను వెనక్కి తీసుకోవాలని కోరారు. యూనివర్శిటీ కి రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీ కార్యక్రమం కు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ లు చేయటం సరికాదని అన్నారు. అరెస్ట్ లను తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

## ప్రశాంతంగా పది తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం తొలి రోజు కావడంతో విద్యార్థులతో పాటు వెంట తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని పరీక్షా కేంద్రాలకు వచ్చారు. తొలి రోజు ఉదయం గం. 8.30 నిమిషాలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. 9 గంటలకు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోని పంపించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలికి అనుమతించలేదు. విద్యార్థులు తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంచారు. కరకగూడెం ఎస్ఐ రాజేందర్ పరీక్షా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మండలంలోని ఐదు పాఠశాలల్లో మొత్తం 129 మంది పరీక్షలు వ్రాశారు.

## మానవత్వం చాటుకున్న కరకగూడెం ఎస్సై



**ప్రజాపక్షం/కరకగూడెం:** పదో తరగతి విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించుకునే కీలక దశలో కరకగూడెం ఎస్సై రాజేందర్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. పరీక్షకు ఆలస్యంగా బయలుదేరిన విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన ఆయన, తన ద్విచక్ర వాహనంలో వారిని స్వయంగా తీసుకెళ్లారు. ఈ హృదయ పూర్వక చర్యకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో పోలీస్‌ల పాత్ర కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాకుండా, అవసర మైనప్పుడు సాయం అందించడమని మరోసారి నిరూపించారు.

## శ్రీ విద్యాభ్యాస పాఠశాల విద్యార్థులకు సహపంక్తి భోజనాలు






**ప్రజాపక్షం/మణుగూరు:** రైల్వే స్టేషన్ పద్మ గూడెం బీసీ కాలనీ వాసి నాగుల నరేష్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి జ్యోతి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస పూర్వ బాలవెలుగు పాఠశాల విద్యార్థులకు సహ పంక్తి భోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులు బి. జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తన భర్త జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం ఏదో ఒక సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల నాగుల జ్యోతిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నరేష్ కుటుంబ సభ్యులు మరియు పాఠశాల సిబ్బంది సుహాసిని దేవి, స్వాతి, చంద్రకళ, సుజాత, రాధ తదితరులు పాల్గొన్నారు.

# తొలిరోజు పది పరీక్ష ప్రశాంతం

**- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్**
**- అమల్లో 144 సెక్షన్, బందోబస్తు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం తొలి పరీక్షైన తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 గం.లకు ప్రారంభమైన పరీక్ష ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12.30 గం. వరకు జరిగింది. తొలిరోజు 12282 మందికి గానూ 12269 మంది హాజరు కావడంతో 99 శాతం హాజరు నమోదైంది. పరీక్షా కేంద్రాల వద్ద ప్రభుత్వం ఎన్ని రకాల ఏర్పాట్లు చేసింది. మంచినీరు, మరుగుదొడ్లు సౌకర్యంతో పాటు అత్యవసర విభాగాలైన వైద్య విభాగం సైతం విధులు నిర్వహించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసిన పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొత్తగూడెంలోని లిటిల్‌బర్డ్స్, పాల్వంచలోని కేటిపిఎస్ కాలనీలో గల జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలపై



ఆరా తీశారు. పరీక్షా కేంద్రాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, చిత్తుకాగితాలో లేకుండా చూడాలన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణలో పరీక్షలు రాసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏడాదిపాటు చదివిన విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలన్నారు.

## ప్రాంగణ నియామకాల్లో 46 మంది విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రముఖ అంతర్జాతీయ వాహన రంగ సంస్థ రెనాల్ట్ నిసాన్‌కు తమ కళాశాలకు చెందిన 46 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్‌బిఐటి కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ప్రాంగణ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా



గుండాల కృష్ణ మాట్లాడుతూ పెరుగుతున్న ప్రమాణాల దృష్ట్యా వాహన రంగంలో రానున్న రోజుల్లో మరింత ఆదరణ ఉంటుందన్నారు. అత్యంత వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో వాహన రంగం ముందుంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ రెనాల్ట్ నిసాన్ వంటి అంతర్జాతీయ సంస్థలలో తమ విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాకుండా ఇతర కోర్ రంగాల వైపు కూడా యువత దృష్టి సారించాలన్నారు. ఇంజనీర్ ట్రైనీ ఉద్యోగాలకు జరిగిన ఎంపికలలో 84 మంది ఈసిఈ, ఈఈఈ విద్యార్థులు పాల్గొనగా 62 మంది వ్రాత పరీక్షకు ఎంపికై మౌఖిక పరీక్షకు అర్హత సాధించారు.తుది పరీక్షల్లో 46 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు ఇతర సదుపాయాలతో పాటు వార్షిక ఆదాయం మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ సెల్ఫ్ డ్రైవింగ్ కార్స్, ఏఐ ఆధారిత రంగాలు అధునీక టెక్నాలజీని శాసిస్తున్నాయని గడిచిన దశాబ్దంలో ఎలక్ట్రికల్, వాహన రంగాల్లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. వాహన విడి భాగాలు, బ్యాటరీలు అందించే రెనాల్ట్ నిసాన్ వంటి సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ ప్రో హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటీవ్స్ ప్రకాష్, ఐ. పైజాన్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్,గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు, టిపివో ఎన్. సవిత, కో ఆర్డినేటర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘాల బలోపేతానికి కృషి

**-డిసిసిబి ఛైర్మన్**
**దొండపాటి వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయనున్నట్లు డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన కేంద్ర సహకార బ్యాంక్ 126వ మహాజన




సభ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024 25 వార్షిక నివేదిక, 31 డిసెంబర్ 2024 వరకు అయిన ఖర్చులు, 2025 26 సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదిత బడ్జెట్, సెక్షన్ 53, ఇన్‌స్పెక్షన్ నివేదిక, బ్యాంకు ఏ క్లాస్, బి క్లాస్, అధీకృత మూలధనం పెంచుటకు బైలా నెం.7 సవరణ మొదలగు సంబంధించిన ఎజెండాలను బ్యాంక్ ఇంచార్జి సిఈవో ఎన్. వెంకట ఆదిత్య ప్రవేశ పెట్టగా మహాజన సభ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకు పరిధిలో గల సహకార సంఘాల అధ్యక్షుల సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకుని సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఇంచార్జి సిఈవో వెంకట ఆదిత్య మాట్లాడుతూ సంఘాల పురోభివృద్ధికి, సంఘాల ద్వారా దీర్ఘ కాలిక రుణాలు మంజూరు చేయుటకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకు పరిధిలో అర్హత కలిగిన అన్ని సంఘాల ద్వారా దీర్ఘకాలిక రుణాల మంజూరుకు తగు ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తామని ఆయన తెలిపారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న అన్ని రకాల సేవలు ప్రతి రైతుకు అందేలా బ్యాంకు అధ్యక్షులు, పాలక వర్గ సభ్యుల సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిసివో గంగాధర్‌రావు, డిఏవో పుల్లారావు, పాలక వర్గ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు, వ్యవసాయేతర సంఘ అధ్యక్షులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన బచ్చోడు యువతి

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** కష్టపడి చదివి తొలి ప్రయత్నం లోనే రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచిన యువతి భౌమి వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని బచ్చోడు గ్రామానికి చెందిన ఆమంచి శ్రీనివాస్ స్వప్న దంపతుల కుమార్తె భౌమి తండ్రి శ్రీనివాస్ చిన్న వయసులోనే గుండెపోటుతో మరణించగా తాతయ్య ఆమంచి వెంకన్న నాయనమ్మ నాగలక్ష్మి దగ్గర స్వప్న ఉంటూ కూతురు భౌమి ని పెంచుతూ చదివించింది. ఒకటి నుండి ఏడో తరగతి వరకు దమ్మాయిగూడెం ఎవర్ సైన్ స్కూల్లో చదవగా ఏడు నుండి పదో తరగతి వరకు



నిర్మల్ హృదయ్ స్కూల్లో చదివింది అనంతరం హైదరాబాదు నందు సివిల్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ డిప్లమా లో 95 మార్కులు సాధించింది. బిటెక్లో గోల్డ్ మెడల్ సాధించి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం టీజీపీఎస్సీ నిర్వహించిన పోటీ పరీక్షల్లో కష్టపడి చదివి పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ నందు మిషన్ భగీరథలో ఏఈ గా అలాగే మున్సిపల్ అండ్ టౌన్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ నందు నియామకము పొందినారు. భౌమి పెదనాన్న ఆమంచి సత్యనారాయణ ప్రభుత్వ టీచర్ గాను మరియు చిన్న నాన్న ఆమంచి నాగేశ్వరరావు ఉస్మానియా విశ్వవిద్యాలయం నందు జువాలజీ ప్రొఫసర్ గా పనిచేయుచున్నారు. వారి ప్రోత్సాహంతోనే భౌమి చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. రెండు ప్రభుత్వఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, మిత్రులు మరియు గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## యోగాతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యోగాతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, గర్భిణీలకు సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఉంటుందని డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సైదులు తెలిపారు. కలెక్టర్ ఆదేశానుసారం డిఎంఅండ్‌హెచ్‌వో సూచనల మేరకు శుక్రవారం మహిళా ప్రాంగణ మేనేజర్ విజేత



ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న స్టాఫ్ నర్సులకు ఒక రోజు యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రతి రోజు మన యొక్క జీవనం యోగాతో ప్రారంభమైతే ఆరోగ్యవంతంగా ఉంటామని ఆయన తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు యోగా ద్వారా జరిగే ప్రయోజనాలు వివరించడం వల్ల సాధారణ ప్రసవాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. స్టాఫ్‌నర్స్ యోగా గురించి తెలుసుకోవాలని తెలిపారు. గర్భిణీగా నమోదైన నాటి నుంచి యోగా పట్ల అవగాహన కల్పించాలని ఇందు కోసం ప్రతి పిహెచ్‌సి, సబ్ సెంటర్లలో యోగా ట్రైనర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ వద్దు సాధారణ ప్రసవం ముద్దు అని వివరిస్తూ గర్భిణీ స్త్రీలు యోగా ద్వారా సాధారణ ప్రసవాలు జరిగేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్, సిబ్బంది రఘురాం, రవితేజ పాల్గొన్నారు.

## డిప్యూటీ ఆర్ఎంగా మల్లయ్య బాధ్యతలు స్వీకరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆర్టిసి డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్ అండ్ ఆపరేషన్)గా మల్లయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్లుగా పని చేస్తున్న భవాని ప్రసాద్ మహబూబ్ నగర్‌కు, జిఎన్ పవిత్ర సికింద్రాబాద్ రీజినల్ కార్యాలయంకు బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో డిప్యూటీ ఆర్ఎంగా మల్లయ్య బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన



అనంతరం డిప్యూటీ ఆర్ఎం ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్ఎంను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, సిబ్బంది డిప్యూటీ ఆర్ఎంకు శుభాకాంక్షలు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న జర్నలిస్టుకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గత కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఖమ్మం నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పేరబోయిన తిరుపతిరావుకు టియుడబ్ల్యూజె (టిజెఎఫ్ ) యూనియన్ ఆర్థిక సహాయం అందించారు. తిరుపతిరావు అనారోగ్య పరిస్థితిని తెలుసుకున్న టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) బృందం శుక్రవారం వారి స్వగృహానికి



వెళ్లి పరామర్శించారు. తిరుపతిరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎటువంటి ఇబ్బంది వచ్చినా తమ దృష్టికి తీసుకు రావాలని తక్షణమే పరిష్కరించి అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/పెనుబల్లి:** 2024 25 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పెనుబల్లి మండలంలో నాలుగు సెంటర్లలో మొత్తం 738 విద్యార్థులకు 737 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకే ఒక్క విద్యార్థి గైర్హాజర్ అయ్యారు. ఉదయం 8



గంటల నుండే విద్యార్థులు హాల్ టికట్లతో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. నిర్దేశిత పరీక్ష సమయానికి విద్యార్థిని విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలలోకి అనుమతిని ఇచ్చారు. పరీక్ష కేంద్రాలను ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పరీక్ష కేంద్రానికి 200 మీటర్లు పరిధిలో 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ ని పోలీసులు అమలుపరిచారు. మొదటి రోజు పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలియజేశారు.

## ప్రశాంతంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో ప్రశాంతంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి మండల వ్యాప్తంగా మొత్తం 425 మంది విద్యార్థులు ఉండగా విద్యార్థులు 242 మంది విద్యార్థినీలు 183 మంది ఉండగా మొదటిరోజు శుక్రవారం ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి మండల పరిధిలోని తిరుమలా



యపాలెం పిండిప్రోలు బీరోలు సుబ్లేడ్ గ్రామాలలో ఉన్న హైస్కూల్లో పరీక్షలు అధికారులు నిర్వహించారు. పరీక్షా కేంద్రం వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు విద్యార్థులకు మంచినీటి సౌకర్యం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. సుబ్లేడ్ పరీక్ష కేంద్రంలో ఒక విద్యార్థి పరీక్షలకు గై హాజరు అయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద స్థానిక ఎస్ఐ కూచిపూడి జగదీష్ తన సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

# చారిత్రక విజయాలు సాధించాం




**-ఉద్యమాల గుమ్మం ఖమ్మం**
**-ఆత్మీయ సమ్మేళనంలో ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వ అండతో అనతికాలంలోనే చారిత్రక విజయాలు సాధించామని తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి తెలిపారు. ఎన్నో చారిత్రక పోరాటాలకు జాతీయ స్థాయి ఉద్యమాలకు పురుడుపోసుకున్న ఉమ్మడిఖమ్మంజిల్లా వేదిక నుండి తెలంగాణ ఉద్యోగ జేఏసి తన ఆత్మీయ సమ్మేళనం, సమావేశాల విజయ యాత్రను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం ఖమ్మంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉద్యోగులకు అండగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు మంత్రి వర్గం, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారుల సహకారంతో అనతి కాలంలోనే చారిత్రక విజయాలు సొంతం చేసుకున్నామన్నారు. 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టులను సాధించడం, గ్రామస్థాయిలో రెవెన్యూ సేవలను అందుబాటులోకి తేచ్చేందుకు గ్రామానికి ఒక అధికారిగా 10,954 పోస్టుల ఏర్పాటు అతిపెద్ద విజయాలని లచ్చిరెడ్డి తెలిపారు.రాష్ట్రంలో కొత్త డివిజన్లు, కొత్త మండలాల్లో పోస్టుల మంజూరు జూనియర్ అసిస్టెంట్ల నుంచి డిప్యూటీ కలెక్టర్ల వరకు పదోన్నతులు సాధించడం, తహసీల్దార్లు, ఆర్డీవోలు, జేసిలు గతంలో కోల్పోయిన అధికారాలను భూ భారతి చట్టంతో పునరుద్ధరణ చేయడం జరుగుతుందన్నారు. పూర్వ విఆర్ఏ, విఆర్వోలను అప్షన్ పద్ధతిలో తిరిగి మాతృశాఖలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. ఈ సమ్మేళనంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, టిజీటిఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రాములు, రమేష్ పాకా, టిజీటిఏ సెక్రటరీ జనరల్ పూలసింగ్ చౌహాన్, డిప్యూటీ కలెక్టర్ల రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహారావు, మంగీలాల్, తుమాటి శ్రీనివాస్, కోట రవికుమార్, అశోక్‌కుమార్, భద్రునాయక్, గుండు రాజులు, జాదవ్ మాణిక్యరావు, ప్రతాప్, అభిరామ్,మురళి, బానాల రాంరెడ్డి, వి. భిక్షం, గరికె ఉపేంద్రరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు రావాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వేసవిలో ప్రజల దాహార్తి ని తీర్చేందుకు స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలం లోని ఆజయ్ తండా లో భూక్యా రుక్మిణీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలి వేంద్రం ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో అనేక మంది యువత, స్వచ్ఛంధ సంస్థలు సామాజిక సేవలో దూసుకెళ్తున్నారని పేర్కొన్నారు. రుక్మిణీ కుటుంబ సభ్యులు గ్రామంలో వేసవి లో తాగునీటి ని అందించేందుకు ముందుకు రావటం సంతోషం అన్నారు. ఈ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పంచాయతీ కార్యదర్శి ఆవుల నవ్య, కుటుంబ సభ్యులు సిఐఎస్ఎఫ్, ఏఎస్ఐ భూక్యా రామకృష్ణ, బి.సుశీల, భద్రమ్మ, భాస్కర్ రావు, పద్మ, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ సక్రునాయక్, మాజీ సర్పంచ్ పార్వతి బాయి. గ్రామ పెద్దలు టి.నరేష్, రామోజీ, బీ.రామారావు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని తగలబెట్టిన గుర్తుతెలియని దుండగులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇంటి వద్ద ఉన్న బైక్ ను గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారులోకి తీసుకెళ్లి తగలబెట్టిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన గోగుల రామారావు అనే వ్యక్తి కి చెందిన ద్విచక్ర వాహనం ను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తెల్లవారుజామున దగ్ధం చేశారు. ఇంటి వద్ద ఉన్న బైక్ ను గ్రామ శివారు వరకు తీసుకెళ్లి, దగ్ధం చేయటంతో గ్రామస్తులు బంగుతింటున్నారు. బైక్ ను ఇంటి నుంచి తీసుకెళ్లి దగ్ధం చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది. పాతకక్షల నేపథ్యంలో ఎవరైనా కావాలనే ఉద్దేశ్యంతోనే చేశారా... లేక మరే ఇతర కారణాలు ఉన్నాయా తెలియాల్సి ఉంది. కాగా బాధితుడు రామారావు గత రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై ఖమ్మం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో బైక్ దగ్ధం విషయం తో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. ఇంటిలో ఉన్న బైక్లకు భద్రత లేదా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో బైక్ దగ్ధం తో భయంతో వణికిపోతున్నారు. పోలీసులు ఘటనా స్థలం కు చేరుకుని వివరాలు సేకరించారు. మొత్తం మీద నాచేపల్లి బైక్ దగ్ధం గ్రామంలో ఉలిక్కిపడ్డారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

**-భర్తకు గాయాలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లో కెళితే... సత్తుపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అడపా రాజేంద్రప్రసాద్, పుష్పావతి దంపతులు కారులో అశ్వారావుపేట గుడికి వెళ్ళి తిరిగి వస్తుండగా బేతుపల్లి గ్రామం వద్ద సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపుగా వెళ్తున్న పాల వ్యాన్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. తక్షణమే చుట్టుపక్కల వారు క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించే లోపే అడపా పుష్పావతి (55) మరణించినట్లు వైద్యులు తెలిపారు. రాజేంద్రప్రసాద్ కు గాయాలయ్యాయి. వీరి కుమార్తె హర్షిణి కి గత శనివారమే వివాహం జరగ్గా పెళ్లింట విషాదం నెలకొంది. మృతురాలిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డా.దయానంద్ పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## నిరుద్యోగ యువకులను మోసం చేస్తున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం పేరుతో నిరుద్యోగ యువకులను దగ చేస్తుందని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) పాలేరు నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాస పథకం కు దరఖాస్తు చేసుకోవాలి అంటే రేషన్ కార్డు తప్పనిసరి అని కానీ ప్రభుత్వం ఏర్పడి నేటి వరకు రేషన్ కార్డులు జారీ చేయలేదని ఆరోపించారు. గత 11 సంవత్సరాలు గా యువకులకు రేషన్ కార్డుల్లో పేరు కూడా లేదు ఇలాంటి తరుణంలో యువత ఎలా దరఖాస్తులు చేసుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే చాలా తక్కువ మందికి దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డు లేని నిరుద్యోగ యువకుల గురించి ప్రభుత్వం తెలపాలి అని అన్నారు. రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులు రేషన్ కార్డులు లేని వారు కూడా కల్పించే విధంగా ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



## ఆదివాసీలకు వైద్య శిబిరం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రియాంక ఆధ్వర్యంలో వైద్య బృందం శాంతినగర్ శివారు అటవీ ప్రాంతంలోని చత్తీష్‌ఘడ్ ఆదివాసీలు నివసించే ఏమైనా రజబలి నగర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వర పీడితులకు మలేరియా రాపిడ్ టెస్ట్ చేసి ఫలితాలను నిర్ణయించి వెంటనే చికిత్సలను ప్రారంభించారు. గర్భిణీ స్త్రీలకు పరీక్షించి తగిన సలహాలు మందులు అందించారు. దోమల నివారణకు గాను ఫోకల్ స్ప్రే చేశారు. ఈసందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ వేసవి కాలంలో వడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళలు పురుషులు ఎక్కువ సమయం ఎండలో పని చేయకుండా నీడ పట్టున పని చేయాలన్నారు. పిల్లలకు ఎక్కువగా నీరును తాగించాలని, చిన్న పిల్లలకు వేసవికాలంలో వాంతులు, విరోచనాలు అయితే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రకాశరావు, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్, ఆరోగ్య కార్యకర్తలు ప్రేమలత, జ్యోతి, ఆశ కార్యకర్త సీతమ్మ, శంకర్ పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లా స్థాయిలో ఎంసెట్ మోడల్ పరీక్ష



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** గత అయిదు సంవత్సరాలుగా ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో టాప్ కాలేజ్‌ల్లో సీట్లు సాధిస్తున్న స్థానిక సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఏప్రిల్‌లో జరగబోయే ఎంసెట్ ప్రవేశ పరీక్ష వ్రాయబోవు విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించుటకు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో ఈ ఎంసెట్ మోడల్ పరీక్షను భద్రాద్రి జిల్లా స్థాయిలో ఈనెల 23 ఆదివారం ఉదయం 9గంటలకు బ్రిలియంట్ కాలేజ్ సారపాక నందు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ బివిఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంసెట్‌కు అప్లై చేసి ఏప్రిల్‌లో పరీక్ష వ్రాయు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ మోడల్ పరీక్షలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు అన్నారు. ఈ మోడల్ పరీక్ష వ్రాయు విద్యార్థులు ఒక రోజు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ సారపాక నందు సెల్ 9866283566, 9705137128ను సంప్రదించాలన్నారు.

## వైభవంగా బోనాల ప్రదర్శన



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి మహిళలు, భక్తులు, గ్రామస్తులు శుక్రవారం భారీగా బోనాలు సమర్పించారు. ఇటీవల తాళ్లగూడెంలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లికి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. ఆ రోజు నుండి ఎంతో నిష్టతో పూజలు చేసిన ఆ గ్రామ ప్రజలు, మహిళలు 16 రోజుల పండగ సందర్భంగా గ్రామంలో మహిళలు బోనాలు, ఎత్తుకొని మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గోపయ్య సమేత లక్ష్మీ తిరుతపమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మొక్కులు కూడా చెల్లించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారునికి మంత్రి పొంగులేటి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు సాదిక్ అలి గత పది రోజుల క్రితం బైక్ ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స పొంది ఇంటి వద్ద ఆర్థిక ఇబ్బందిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్ చేసి ఆర్థిక సహాయం చెయ్యాలని సాదిక్ అలి కోరడంతో స్పందించి మంత్రి పొంగులేటి ఏమి ఇబ్బంది పడమాకు పెద్దాయన అని సాదిక్ అలికి ధైర్యం చెప్పి, వెంటనే మంత్రి పొంగులేటి స్థానిక నాయకుడు ఇమ్మడి తిరుపతిరావుకు రూ 10వేలు పంపించి ఆర్థిక సహాయం చేయమని ఆదేశించారు. శ్రీనన్న తన మనుషులతో 10వేల రూపాయలు పంపినందుకు సాదిక్ అలి మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, ఎండి యాకుబ్, తోగార శ్రీను, ఎస్‌కే మజీద్ పాషా, అదెర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలు తొలిరోజు ప్రశాంతం



**ప్రజాపక్షం/చింతకాని :** పదో తరగతి వార్షిక పరీక్షలు చింతకాని మండలంలో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఉదయం 9:30 గంటలకు ప్రారంభం కానుండగా విద్యార్థులు సుమారు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తొలి వార్షిక పరీక్ష కావడంతో విద్యార్థులు తమకు ఇష్ట దైవాలకు పూజలు చేయడంతో పాటు తమ హాల్ టికెట్లకు సైతం ప్రత్యేక పూజలు చేయించుకొని పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.చింతకాని మండల వ్యాప్తంగా 3 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. తొలి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 490 మంది విద్యార్థులకు గాను 490 మంది హాజరయ్యారు. నూరు శాతం హాజరు నమోదైనట్లు ఎంఈవో వీరపనేని శ్రీనివాసరావు తెలిపారు.